# ఉన్నేలు

ఏ.వి. శేషారత్నం

కేన్వాస్ మీద కుంచెన చకచకా కదుల్తోంది.

రంగులు మారుతున్నాయి.

మళ్ళీ కుంచె పరిగెత్తింది.

అరగంట తరువాత కుంచె విశ్రాంతిగా ఆగింది.

"అబ్బ, ఎంత బాగా వేశారు అమ్మాయిగారూ"

చప్పట్లతో ఉలికిపడి వెనక్కి తిరిగింది నైవేలి.

ఉన్నేలు విప్పారిన కళ్ళతో ఆనందంగా బొమ్మను చూస్తోంది.

అందమైన అడవి-

చిక్కటి పచ్చని అడవి-

చిన్నారి కన్నెలేడి తన సహచరుడికోసం ఎదురుచూస్తోంది.

ఆ చూపులో ప్రియు డొస్తాడో రాడో అన్న ఆవేదన-

రాకపోతే ఎలాగ అన్న ప్రశ్న-

నిరీక్షణలో గుండె కరిగి నీరౌతున్న భావన-

ప్రియుడి పట్ల ఆరాధన-

"అమ్మాయిగారూ ! మీ రచ్చం ఆ లేడిలాగ ఉన్నారు."

పదేళ్ళ ఉన్నేలు మాటలకి నైవేలి గుండె వేగంగా స్పందించింది.

పసిపిల్లయినా ఎంత చక్కగా భావన చేయగలిగిందో.

అయినా ఇదేమిటి ఈ చిత్రాన్ని తను ఇలా గీసింది?

అంటే ఆర్టిస్టు మనసు ఎక్కడెక్కడ పరిభ్రమిస్తుందో-ఏ భావంతో ఆర్ద్రమవుతుందో అదే కేన్వాసుమీద అసంకల్పిత ప్రతీకార చర్యలా ముద్ర పడుతుందన్న మాట !

అసలు తను వెయ్యాలనుకున్న బొమ్మ ఏమిటి?

కేన్వాసు మీద కొచ్చిన దేమిటి?

తనింత బేల అయిపోతేం దేమిటి?

తన ఆత్మస్థైర్యమంతా ఏమైపోయింది?

ఏం జరిగినా భగవంతుని లీల అనే తన సిద్ధాంతం ఏమయ్యింది.

"ఏం టమ్మాయిగారూ ఉలకరు? అసలు మీ రివాళ బువ్వేండుకున్నారా?"

గబగబా వంటగదిలోకి పోయి చూసొచ్చి గదమాయిస్తున్నట్టుగా అంది ఉన్నేలు.

"నే ననుకుంటూనే ఉన్నాను. మీ రంతపనీ చేశారు? బువ్వ తినకపోతే మనం బతికే దెలా? మీ కీ మాత్రం ఆలోచన లేకపోతే ఎలా బాబూ? ఎంతసేపూ బొమ్మలు గీయడం తప్ప మీకేం అక్కర్లేదు. దేవుడు నన్నూ మీలా పుట్టిస్తే ఎంత బాగుణ్ణు. నాకేమో పుట్టెడు ఆకలి. మీరు కాఫీ కాచేరేమో నని పరిగెత్తుకొచ్చాను."

ఆరిందాలా వసపిట్టలా మాట్లాడుతున్న ఉన్నేలుని చూసి నవ్వింది నైవేలి.

"ను వ్వంటే నాకూ కాఫీ తా గా లనిపిస్తోంది రోజీ రా కాచుకుందాం."

ఉన్నేలు ఉత్సాహంగా గెంతింది. ఆ పిల్లకి కాఫీ అంటే ప్రాణం. ఆ ప్రాంతంలో అంత చోడిజావ తాగడానికి అలవాటుపడ్డవాళ్ళే తప్ప కాఫీ, టీ లెరగరు.

నైవేలి అక్కడ చేరిన కొత్తలో కాఫీ చేస్తుంటే ఉన్నేలు విప్పారిన కళ్ళతో మరుగుతున్న ఆ ద్రవం వంక ఎగాదిగా చూసి కమ్మటి వాసనకి ముక్కుపుటా లెగరేసింది.

"నీ క్కావాలా?"

"ఎలా గుంటుంది?"

"తాగి చూడు."

"అబ్బ ఎంత బాగుంది. అమ్మాయిగారూ ! మీకు రోజూ మీ రిక్కడున్నన్నాళ్ళూ గిన్నెలు తోమిపెడతాను. కాఫీ ఇస్తారా?"

నైవేలి నవ్వేసింది.

"అలాగే డబ్బులు కూడా ఇస్తానులే."

అప్పట్నుంచే ఉన్నేలు నైవేలికి ఆరోప్రాణమైపోయింది. తల్లీదండ్రీ, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు అంతా పక్క గ్రామంలో ఉంటారు. పగలంతా వాళ్ళు కూడా తలో చోటకి పనుల్లోకి పోతారు. రాత్రి కెప్పుడో గూటికి చేరుకుంటారు.

ఈ గ్రామంలో ఫారెస్టాఫీసరుగారి కుటుంబంలో పనికి చేర్చి ఇక్కడే ఉంచేశారు ఉన్నేల్ని. జీతం మాత్రం తల్లి వచ్చి తీసుకెళ్తూంటుంది.

ఉన్నేలు అసలు పేరు ఏదో ఉంది. నైవేలి దాని ఎర్రని రూపం చూసి 'రోజీ' అని పేరు పెట్టింది. ఆ పిల్లకి కూడా ఆ పేరెంతో నచ్చి ఆఫీసరుగా రింట్లో కూడా అందరిచేత అలాగే పిలిపించుకుంటుంది. దాని చురుకుదనం చూస్తే నైవేలి కెంతో ముచ్చట. అమాయకంగా గలగలా ఎప్పుడూ ఏదో మాట్లాడుతూ, ప్రశ్నలు వేస్తూంటే నైవేలికి కాలం తెలియదు.

పేరుకి ఆఫీసరుగా రింట్లో పని అనేగాని గ్రామం అంతా చుట్టబెట్టి వస్తుంది ఉన్నేలు. దాని మాటలంటే అందరికీ సరదా. ఏదో వాగిస్తూ నవ్వుతూ ఉంటారు.

ఉన్నేలికి నైవేలి అంటే మహా ఇష్టం.

స్కూలుకి వెళ్ళేందుకు తయారయిన నైవేలిని బుగ్గన వేలేసుకుని చూస్తుంది.

"అబ్బ మీరెంత అందంగా ఉన్నారు అమ్మాయిగారూ ! మీ చీర ఎంత బాగుందో చెప్పలేను."

రోజూ ఏ చీర కట్టినా అదే మాట.

"నేనూ చదువుకుంటే ఎంత బాగుణ్ణు. పలకా బలపం పట్టుకుని మీ ఎదురుగా కూర్చునేదాన్ని. మీరు చదువు బాగా చెప్తారట - పిల్లలంతా చెప్తారు."

"పోనీ నీ పనంతా అయిపోయాక రాత్రిపూట రా అక్షరాలు దిద్దుదుగాని."

"అమ్మో అమ్మగా రొప్పుకుంటారో లేదో" పైకి అలా అంది గాని చదువుకోవాలని దాని కళ్ళలో ఎంత ఆశ !

కాని రోజూ స్కూలుకి పంపి చదివించడానికి వాళ్ళ కుటుంబానికి గడవదు. అస లా చుట్టుపక్కల గ్రామాల్లో అన్నీ అలాంటి కుటుంబాలే. రెక్కాడితే గాని డొక్కాడదు. అందుకే స్కూలులో కూడా అంత కలిసి పాతికమంది కంటే పిల్ల లుండరు.

"అమ్మాయిగారూ అసలు విషయం మరిచిపోయాను." కాఫీ తాగుతూ అంది ఉన్నేలు.

నైవేలీ ఆలోచనల్లోంచి బయటికొచ్చింది.

"ఏమిటి?"


"ఇందాక నాగన్న కనిపించాడు."

నైవేలి కళ్ళలో క్షణకాలం ఆశ రెపరెపలాడింది.

"ఉత్తరమేమన్నా వచ్చిందిటా?"

"అదే చెప్తున్నా. మీ కేం ఉత్తరాలూ రాలేదని చెప్పమన్నాడు."

నైవేలి మనసు గాలి తీసిన బెలూన్‌లా



కుంగిపోయింది.

సురేంద్ర బాబుగారు మనల్ని పూర్తిగా మరిచిపోయినట్టున్నారు కదండీ ! లేకపోతే మిమ్మల్ని చూడకుండా ఇన్నాళ్ళు ఎప్పుడైనా ఊరెళ్ళారా?" దబాయిస్తున్నట్టుంది ఉన్నేలు గొంతు.

నైవేలి తడబడింది.

"అక్కడ పట్నంలో బోల్డు పను లుంటాయి కదా"

"మీ రలా గనకండి అమ్మాయిగారూ ! ఇదివరకు ఊరెళ్ళినప్పుడు మీకు రోజూ నేను ఉత్తరం తెచ్చేదాన్ని కాదా నాగన్న నడిగి? మీరెంత బాధపడుతున్నారో నాకు తెలీదా? అసలు అన్నం తింటున్నారా సరిగా? రానివ్వండి సురేంద్ర బాబుగార్ని నాలుగూ దులిపేస్తాను."

అంత బాధలోనూ నవ్వొచ్చింది నైవేలికి. ఈ పిల్లకి తనంటే ఇంత ప్రాణం దేనికో? ఏమిటో ఈ అనుబంధం ! తను రవంత బాధపడితే ఈ ప్రపంచాన్నంతటినీ ఎదిరించి దెబ్బలాడేందుకు తయారైపోతుంది.

"సరే సు వ్వింకా ఇప్పుడే కూర్చున్నావంటే మీ అమ్మగారు నిన్ను దులిపేస్తారు."

"ఓలమ్మో ! చచ్చాను బాబోయ్. అసలు మీ రేసిన బొమ్మ చూస్తూ వచ్చిన పనే మర్చిపోయాను. నా మువ్వల పట్టీలకి ఇంకా ఎన్ని డబ్బులు పడతాయి?"

"ఎందుకు?"

"ఎందుకేమిటి భలేవారే ! అమ్మోరి పండక్కల్లా నాకు పట్టీలు వచ్చేస్తా యన్నారు?"

ఉన్నేలు ఎప్పుడు మువ్వల పట్టీల గురించి అడిగినా నవ్వేస్తుంది. నైవేలికి.

'నాట్యమయూరి' అని ఇక్కడికొచ్చిన కొత్తలో అడవుల్లో స్వేచ్ఛగా ఆనంద నాట్యం చేస్తున్న వనదేవత బొమ్మను చిత్రించింది తను. ఆ బొమ్మకేసి రెప్పలార్పకుండా చూసింది ఉన్నేలు.

"బొమ్మ బాగుందా?" అంది తను నవ్వుతూ.

"కాళ్ళకి ఈ మువ్వల పట్టీలు ఎంత బాగున్నాయి అమ్మాయిగారూ ! అలాంటివి ఈ భూలోకంలో దొరుకుతాయా?"

దాని మాటలకీ, అమాయకత్వానికి మనసుతీరా నవ్వింది తను.

"నీ కంతగా నచ్చాయా రోజీ ! అవి వెండి పట్టీలు. నడుస్తుంటే ఘల్లుఘల్లుమని సవ్వడి చేస్తూ ఎంత బాగుంటాయో? ఇప్పటి ధరని బట్టి రెండు వందల రూపాయలు అవుతుంది" అంది తను.

"అమ్మో అంత డబ్బే? ఎంత పని చేసినా నెలకి నా జీతం పదేను రూపాయలే. రెండు వంద లవాలంటే ఎన్ని నెలలు పడుతుం దమ్మాయిగారూ !"

తన మనసు ద్రవించిపోయింది ఆ చిన్నపిల్ల కోరికకి. అడవిలో స్వేచ్ఛగా తిరిగే చిలకకి సంపాదన అనే వ్యామోహం కలిగితే ఎంత బాధో తనకి తెలుసు.

చీకూ చింతా లేకుండా హాయిగా జీవిస్తున్నారు ఈ అడవిలోని మనుషులు. నాగరికత, చదువు పేరుతో వీళ్ళని పాడుచేస్తున్నామేమో అనిపిస్తుంది - అప్పుడప్పుడూ తనకి. కాని మూఢాచారాల పేరుతో అనారోగ్యంతో, మహమ్మారిలా వ్యాపించి వ్యాధులతో అక్కడి గ్రామాలకి గ్రామాలు తుడిచిపెట్టుకుపోతున్నప్పుడు, రెక్కలు తెగిన పురుగుల్లా పసిబిడ్డలు జబ్బులతో రాలిపోతున్నప్పుడు మాత్రం 'వీళ్ళని అజ్ఞానం నుంచి తప్పించాల్సిన బాధ్యత సాటి నాగరిక



మనుషులకి ఉంది' అనిపిస్తుంది.

అందుకే మారుమూల ప్రదేశమైనా అక్కడి పాఠశాలలో తనకి మొదటి అప్పాయింటుమెంట్ రాగానే కాదనకుండా వచ్చి చేరింది. వచ్చిన కొత్తలో కాలం గడవడం కష్టమయేది గాని ఇక్కడి అమాయకపు పల్లెప్రజల కలుపుగోలుతనం, ఉన్నేలుతో పరిచయం-ముఖ్యంగా హెల్త్ సర్వీసు చేస్తున్న సురేంద్ర పరిచయంతో ఈ ప్రదేశానికి

బాగా అలవాటు పడిపోయింది.

అదీగాక ఈ పరిసరాలు - ప్రకృతి అందాలు - చెట్టూచేమలు, ఇక్కడి ప్రజల సంస్కృతి - తన చిత్రకళకి బాగా దోహదం చేస్తుండడంతో ఇప్పు డీ పల్లెను వదలాలనే అనిపించడంలేదు.

"అమ్మాయిగారూ ! మళ్ళీ ఆలోచనలో పడ్డారూ అమ్మోరి పండగ ఇంక నెల్లాళ్ళే ఉంది." - దిగులుగా అంది ఉన్నేలు.

మువ్వల పట్టీలపైన మనసైనప్పటి నుంచే సంపాదనలో పడింది ఉన్నేలు. చుట్టుపక్కల వాళ్ళకి చేళ్ళు విసిరి పదిపైసలు సంపాదిస్తుంది. కొత్తగా వెలిసిన పచారీ దుకాణంలో ఒక గంట కూర్చుంటుంది. ఇక్కడి కూలీలకోసం వెలిసిన టీకొట్లో 'టీ' కలపడం నేర్చుకుని కొట్టు యజమాని పొరుగూరు వెళ్ళినప్పుడల్లా అందరికీ టీ కాచి, డబ్బులు సంపాదిస్తుంది.

ఫారెస్టాఫీసరుగా రింట్లో ఉన్నేలు కిచ్చే జీతం తల్లి తీసేసుకుంటుంది కనుక వాళ్ళని మెప్పించేందుకు మొక్కలకి నీళ్ళు పోసినప్పుడూ, మొక్కలని అందంగా కత్తిరించినప్పుడూ యజమాని సంతోషంగా ఇచ్చే డబ్బులూ, పండగలు వచ్చాలకీ వాళ్ళిచ్చే డబ్బులూ దాస్తుంది.

పండగలకి ఆఫీసరుగా రింట్లో చేసే కొత్తరకం పిండివంటల్ని దాని వంతు తీసుకుని, అది తినకుండా కడుపు కట్టుకుని ఇక్కడి పల్లెవాళ్ళకి నోరూరేలా చెప్తూ పావలాకీ, పదిపైసలకీ అమ్ముతుంది. ఆ చిల్లర డబ్బులన్నీ నెలకోసారి తెచ్చి ఇక్కడ తన దగ్గర ఉంచిన డబ్బీలో దాస్తుంటుంది. ప్రతి నెలా ఒకటో తారీకున అవన్నీ తనచేత లెక్కబెట్టిస్తుంది.

పోనీ ఎవరైనా ఊరికే డబ్బు లిస్తే చచ్చినా తీసుకోదు ఉన్నేలు. కష్టపడని సొమ్ము నిలవదని అదో పెద్ద నమ్మకం ఆ పిల్లకి. పదేళ్ళ చిన్న బుర్రలోని ఆలోచనలకి తనకెంతో ఆశ్చర్యం కలుగుతుంది.

అందుకే ఉన్నేలు మనసుకి కష్టం కలక్కుండా దానిచేత అక్కర్లేకపోయినా చిన్న చిన్న పనులు చేయించి తనూ పావలా, అర్ధా ఇస్తుంటుంది.

"నీకు పని లేకపోతే ఇలా కూర్చో కాసేపు. డబ్బులు లెక్కచూద్దువు గాని" - ఆలోచనల్లోంచి తేరుకుని డబ్బీ తాళం తీసి చిల్లర దిమ్మరించింది నైవేలి.

ఉన్నేలు కళ్ళు జిగేలుమన్నాయి గుట్టలా పోగయిన చిల్లర చూసి, నైవేలి దగ్గర తను నేర్చుకున్న లెక్కల పరిజ్ఞానంతో వాటిని లెక్కబెట్టేందు కుపక్రమించింది. పదిపైసలన్నీ ఒకవైపు, పావలాలు, అర్ధలూ, రూపాయి కాసులు విడివిడిగా స్తంభాల్లా నిలువుగా నుంచోబెట్టింది.

నాలుగు విడి రూపాయి కాగితాలు చూసి దాని భ్రుకుటి ముడివడింది.

"అమ్మాయిగారూ ! ఇవి నేను ఇందులో వెయ్యలేదు కదూ ఎలా వచ్చాయి? మీరెంతో మంచివారు. నాకు సాయం చేద్దామని వేశారు కదూ ! కాదు కాదు. సురేంద్రబాబుగారు వేసి ఉంటారు. మీరు నా మాట ఎప్పుడూ కాదనరుగా? ఊరికే వచ్చే డబ్బులు నాకొద్దు."

కచ్చితంగా ఖంగుమంటున్న దాని కంఠానికి ముగ్ధురాలయింది నైవేలి.

"అవి ఊరికే రాలేదు రేజీ ! సురేంద్రబాబుగారు ఊళ్ళో లేనన్నాళ్ళూ ఆయన గది నువ్వు రోజూ తుడిచి శుభ్రం చేస్తుంటావుగా.



పదహారు రోజులకి పదహారు పావలాలు అంటే నాలుగు రూపాయలు ముందే ఇచ్చేశారన్న మాట'' - నవ్వుతూ దాని ముక్కు పట్టుకుని ఊపింది నైవేలి.

అప్పటికి తృప్తిపడి తలాడించి దా పిల్ల.

ఒక గంటకి దాని లెక్క తెమిలింది.

''నూట తొంభై మూడు రూపాయలు'' - దాని కళ్ళు చేపల్లా మెరుస్తున్నాయి.

''ఇంకా ఏడు రూపాయలు.''

''చూడు రోజీ ! నేను రేపు మా ఊరెళ్తున్నాను. సెలవు లిచ్చేశారు కదా ! సరిగ్గా నెల్లాళ్ళకి వస్తాను. మరి రోజూ మా ఇంటి వాకిలి తుడిచి ముగ్గు పెడతావు కదా ! వనకన్య చిత్రాన్ని దుమ్ము పడకుండా చూడడమే కాదు. మిగతా వాటిని కూడా జాగ్రత్తగా కాపాడాలి. నేను నీకిచ్చే డబ్బులు ఇందులో వేసి వచ్చేటప్పుడు మువ్వల పట్టీలు తెస్తాను. మీ అమ్మవారి పండక్కి ముందే స్కూలు తీస్తారు కదా !''

నైవేలి మాటలు అమృతం పోసినట్టున్నాయి ఉన్నేలుకి. దాని మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది. అంతలోనే 'నెల్లాళ్ళు నైవేలి కనబడదు' అని తోచి చిన్నబోయింది దాని మొహం.

''నేను ఏడుస్తానని రేపట్నుంచే మీకు సెలవులని చెప్పలేదు కదూ అమ్మాయిగారూ?'' - ఉన్నేలుకి దుఃఖం ముంచుకొచ్చింది.

నైవేలి మనసు నీరైపోయింది. తను అనాథ. అక్కడ పట్నంలో తనకోసం ఎదురుచూసే వాళ్ళెవరూ లేరు. కాని తన ఫ్రెండ్ నీలూ పెళ్ళికి వెళ్ళకపోతే అది ఈ జన్మలో క్షమించదు. అందుకే ప్రయాణం.

పైగా సురేంద్ర ఇన్నాళ్ళెప్పుడూ సెలవు పెట్టలేదు. అతనిదీ ఆ ఊరే కనుక తనని చూసినట్టూ అవుతుంది.

సురేంద్ర గుర్తొచ్చేసరికి ఆమె మనసు చిత్రవిచిత్ర భావాలతో స్పందించింది. తమ పరిచయం ప్రణయంగా మారింది. అతను లేని ఈ ఊరు శ్మశానంలా కనిపిస్తోంది. పెళ్ళి గురించి తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వెళ్ళా డతను. సెలవుల తరువాత దంపతులుగానే తా మీ ఊళ్ళో అడుగుపెడతారు.

అప్పుడు ఉన్నేలు మొహం ఎలా వెలిగిపోతుందో చూడాలి. అది వనకన్యలా మువ్వల పట్టీలతో నాట్యం చేస్తుందేమో?

''అమ్మాయిగారూ ! మీరు వచ్చే నెల పదో తేదీకల్లా వస్తానన్నారు కదూ ! నాకు తేదీలు తెలియవు కనుక, ఒక రోజు గడిచినప్పుడల్లా ఒకోరాయి ఈ కుండలో వేస్తుంటాను.''

దాన్ని కౌగలించుకుని ముద్దు పెట్టుకుంది నైవేలి.

''అమ్మాయిగారూ, ఈ గుమ్మడిపండు నా గుర్తుగా తీసుకెళ్ళి మీరూ మీ నేస్తం తినండి. నేను పదో తారీకు ఉదయం సరిగ్గా ఈ వాగుదగ్గరే మీకోసం ఎదురుచూస్తుంటాను.''

పచ్చని గుమ్మడిపండు నైవేలి చేతుల్లో పెట్టింది ఉన్నేలు. అది అక్కడ ఆచారం. వాళ్ళకెంతో ప్రియమైన గుమ్మడిపండును తమకెంతో అపురూపమైన వాళ్ళకిస్తారు.

నీళ్ళులేని వాగుమధ్య ఇసుకమేట మీంచి చాలాసేపటివరకు చేతు లూపుతూనే ఉం దా పిల్ల.

** ** **

ప్రతి వ్యక్తి ఘనసులోనూ ఒక ముఖ్యమైన సంఘటన జరగ్గానే దాని తరువాతి ఘట్టాల్ని గురించి ఎన్నో ఆలోచనలు కందిరీగల్లా చెలరేగుతాయి. నిబ్బరం పైకి కనిపించే ముసుగే కాని కందిరీగల తుట్టనుంచి ఎవరూ తప్పుకోలేరు.

సురేంద్ర స్నేహం శిశువులా ''నువ్వే నేను'' అని ప్రారంభమైనా ''నీ ఇల్లు నీదే నాది నాదే'' అనే స్వార్థంతో అకాల వార్ధక్యానికి చేరి ''ను వ్వెవరో నాకు తెలియదు'' అంటూ చచ్చిపోయింది.

పైగా తన గుండెలు పగిలేలా నీలూతోనే అతని పెళ్ళి. ఏ కల్మషమూ లేని 'నీలూ' మొహం చూసి తనేమీ నోరెత్తలేకపోయింది.

చిన్నప్పట్నుంచీ ఝంఝామారుతంలా చుట్టేసిన ఆమె స్నేహపూరిత హృదయాన్ని బద్దలు చెయ్యడం ఇష్టంలేక పగిలిన తన గుండె ముక్కల్ని అతుకుపెట్టుకుని బ్రతుకు బండిని లాగించే తాపత్రయంలో ఏవో ఎన్నెన్నో ఊళ్ళు. తిరిగి మనసు కుదుటపరచుకుని ఆ పల్లె పొలిమేరల్లోకి అడుగుపెట్టింది నైవేలి.

తన కున్న ఆశాదీపం 'ఉన్నేలు' మాత్రమే. ఆ పిల్ల కొక్కదానికే తన దుఃఖాన్ని మరిపించగల శక్తి ఉంది.

దాని కళ్ళలో మెరుపే తన చిత్రాలకు ఊపునివ్వాలి. స్వార్థమెరుగని ప్రేమ ఆ చిన్నారి హృదయానిది.

అందుకే వెండి ధర బాగా పెరిగి 'మువ్వల పట్టీల'కు మూడు వందలయినా ఉన్నేలుని ఏదోరకంగా ఒప్పించవచ్చునని, దాని చిన్ని పాదాల నలంకరించాలని - దాని ముఖంలో వెలుగురేఖల్ని తన చిత్రాల్లో బంధించాలని భద్రంగా తెచ్చింది - పట్టీలను-

కాని-

ఆమె జీవితం తన చేతుల్లోంచి జారి ఎటెటో ఎగిరిపోతున్న బెలూన్‌లా అయింది. ఎందుకంటే - కథల్లో జరిగే సంఘటనలే తన జీవితంలో జరుగుతోంటే విస్తుపోయింది నైవేలి.

ఒక్క రోజు విలువను త నెప్పుడూ మరిచిపోకుండా పాఠం నేర్పింది ఉన్నేలు.

''నిన్న పదో తారీకున మీ రొస్తారని దొంగవాగుకాడనే సుంచుంది పంతులమ్మా నా బిడ్డ ! రేపు అమ్మోరి సంబరంలో మీరు తెచ్చే మువ్వల పట్టీలతో నాట్యం చెయ్యాలని పట్టుదలమ్మా దానికి. కాని - చీకటిపడేలోగా అదే తిరిగొస్తాదని ఎలిపోయాం పంతులమ్మా ! కాని - చిరుచీకట్లో దొంగవాగు అమాంతం చుట్టేస్తున్నా కదిలి ఉండదు నా బిడ్డ. మూడు కోసుల కావల ఒడ్డున తేలింది పంతులమ్మా.''

ఉన్నేలు తల్లిదండ్రుల ఏడుపు నైవేలిని మహాప్రవాహంలా ముంచేస్తోంది.

మువ్వల పట్టీలు ఆమె చేతుల్లోంచి జారిపోయాయి ఆమె అదృష్టంలాగే.

శుభ్రంగా తుడిచిన వాకిలిమీద గుమ్మడి పువ్వు ముగ్గు స్వాగతం చెప్పింది.

వనకన్య పటానికి అడవిపూల దండ వాడిపోలేదు-

నైవేలి కళ్ళు అప్రయత్నంగా పనసచెట్టు మొదట్లోని కుండమీదకి మళ్ళాయి.

సరిగ్గా ముప్పై రాళ్ళున్నాయి అందులో - వాటిని గలగలలాడిస్తే మువ్వల పట్టీల సవ్వడి నైవేలి గుండెను పిండేస్తోంది.

స్వార్థపరుడైన సురేంద్రకోసం తన ఎదురుతెన్నుల్ని చిటికెలో పట్టేసింది ఉన్నేలు ఆ రోజు.

కాని - తనకోసం ఒక నిస్వార్థ అమాయక చిన్నారి ప్రాణం ఎదురుచూస్తూ - పట్టుదలతో - ఎంత ప్రగాఢ నమ్మకంలో కొట్టుమిట్టాడిందో తను గుర్తించలేకపోయింది.

ఉన్నేలు తన కిష్టమయిన 'వనకన్య' చిత్రానికి తగిల్చిన అడవిపూల వాసన గదినిండా చుట్టుముట్టే ఉంది.

''మీ రొచ్చేదాకా నే నిక్కడ్నుంచి కదలను అమ్మాయిగారూ గుర్తుంచుకోండి'' - వాగు ఒడ్డున ఉన్నేలు గొంతు కంచుగంటలా ప్రతిధ్వనిస్తూనే ఉంది. ✱

